మలేరియాకు ముకుతాడు!

- రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు
- దోమల వ్యాప్తి నివారణకు విస్తృతంగా కార్యక్రమాలు
- మూడేళ్లుగా మలేరియా తగ్గుముఖం
- నేడు ప్రపంచ మలేరియా దినోత్సవం



మురికినీటిపై క్రిమిసంహారక మందు పిచికారీ చేయిస్తున్న వైద్య సిబ్బంది

కర్నూలు(హాస్పిటల్): దోమ పుట్టకూడదు...పుట్టినా కుట్టకూడదు అనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు గుడ్డు దశలోనే దోమలు పుట్టకుండా నిర్మూలన చర్యలు తీసుకుంటోంది. ఒక వేళ గుడ్లు పగిలి దోమలుగా మారినా వాటిని సంహరించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతోంది. తద్వారా దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులను అరికడుతోంది. ముఖ్యంగా ప్రాణాంతకమైన మలేరియా దోమలను దాదాపుగా నిర్మూలించే స్థితికి వచ్చింది. ఈ నెల 25వ తేదీన 'ప్రపంచ మలేరియా దినోత్సవం' సందర్భంగా ప్రత్యేక కథనం.

జిల్లాలో 35 ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, ఐదు సీహెచ్‌సీలు, రెండు ఏరియా ఆసుపత్రులు, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల, 28 అర్బన్ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. ఆయా కేంద్రాల్లో మలేరియా వ్యాప్తి నిర్మూలనకు అవసరమైన చర్యలను మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఏదైనా జ్వరం కేసు బయటపడిన వెంటనే సదరు వ్యక్తికి రక్తపూతల పరీక్షలు నిర్వహిస్తారు. మలేరియా నిర్ధారణ అయితే అతనికి అవసరమైన మలేరియా మందులు అందజేస్తారు. దాంతో పాటు కేసు నమోదైన వ్యక్తి ఇంటికి చుట్టుపక్కల 50 ఇళ్లల్లో యాంటీ లార్వా ఆపరేషన్స్ నిర్వహిస్తారు. ఈ మేరకు తీసుకుంటున్న చర్యల ఫలితంగా మూడేళ్లుగా జిల్లాలో కేసుల సంఖ్య గణనీయంగా తగ్గుముఖం పడుతోంది.

మలేరియా వ్యాపించే విధానం

ఆడ అనఫిలిస్ దోమ కుట్టిన 12 నుంచి 15 రోజుల్లో మలేరియా వ్యాధి లక్షణాలు బయటపడతాయి. దీనిని ఎంత త్వరగా గుర్తిస్తే అంత త్వరగా పూర్తి కాలం కోర్సు తీసుకోవాలి. మలేరియాలో ప్లాస్మోడియం వైవాక్స్ కంటే మెదడుకు సోకే మలేరియా(పీఎఫ్) చాలా ప్రాణాంతకమైంది. ప్రజల్లో మలేరియాపై అవగాహన పెంపొందించడంలో స్థానిక, స్వచ్ఛంద సంస్థల పాత్ర ప్రముఖమైనది.

జిల్లాలో మలేరియా కేసులు

సంవత్సరం	పరీక్షలు	కేసులసంఖ్య
2016	2,38,750	250
2017	2,51,986	16
2018	2,36,704	19
2019	2,49,187	8
2020	1,93,586	14
2021	2,56,395	18
2022	3,16,178	6
2023 ఇప్పటివరకు	1,00,525	0

నివారణ చర్యలు ఇలా..

- ఇంటి పరిసరాల్లో దోమలు పెరిగేందుకు అనువుగా ఉండే నీటి నిల్వలను నిర్మూలించాలి.
- తాగి పారేసిన కొబ్బరిబోండాలను ముక్కలుగా చేసి చెత్తకుండీలో వేయాలి.
- ఓవర్‌హెడ్ ట్యాంకులు, నీటినిల్వ పాత్రలను, ఎయిర్ కూలర్లు, డ్రమ్ములు లాంటి వాటిని పూర్తిగా ఖాళీ చేసి శుభ్రం చేయాలి.
- కాల్వలో వ్యర్థాలు, చెత్త, చెట్లకొమ్మలు వేయరాదు.
- వారానికి ఒకసారి పూలతొట్టెలలో, పూల కుండీలలో నీరు మార్చాలి.నీరు నిల్వ ఉండకుండా చూడాలి.
- దోమలు లోపలికి రాకుండా కిటికీలకు సన్న జాలిని కట్టాలి. దోమతెరలు తప్పనిసరిగా వాడాలి.
- టైర్లు, రోడ్డుపై గుంతలో వర్షపునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలి.
- జ్వరం వచ్చిన వెంటనే నిపుణులైన వైద్యులను సంప్రదించాలి.
- ఉదయం, సాయంత్రం సమయాల్లో కిటికీలు, తలుపులు మూసి ఉంచాలి.
- జనావాసానికి ఐదు కిలోమీటర్ల దూరంలో పందులను ఉంచాలి.

విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు



ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 25న జిల్లా వ్యాప్తంగా అన్ని పీహెచ్‌సీల్లో, జిల్లా కేంద్రంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నాం. దోమలు కుట్టకుండా ఎవరికి వారు స్వీయరక్షణ చర్యలు తీసుకోవాలి. ఇల్లు, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలి. మలేరియా కేసు బయటపడిన ప్రాంతంలో దోమల నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నాం. జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశంలో దోమల నిర్మూలనకు అవసరమైన చర్యలు చర్చించాం.

–డాక్టర్ బి. రామగిడ్డయ్య, డీఎంహెచ్‌ఓ, కర్నూలు

చర్యలు తీసుకుంటున్నాం



ప్రతి సంవత్సరం ఏప్రిల్ 25న ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ఇప్పటి నుంచి వర్షాలు ప్రారంభమయ్యే జూన్ నాటికి దోమలు పుట్టకుండా, వృద్ధి చెందకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. పైరిత్రమ్, డీటీటీ స్ప్రేయింగ్, ఐఆర్‌ఎస్ మందులు చల్లేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నాం. మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖల సమన్వయంతో నీటి ట్యాంకులను శుభ్రం చేయిస్తున్నాం. నీటి నిల్వలున్న ప్రాంతాల్లో గంబూజియా చేపలను వదులుతున్నాం.

–నూకరాజు, జిల్లా మలేరియా అధికారి, కర్నూలు

నిర్లక్ష్యం చేస్తే ప్రమాదం



జ్వరమే కదా అని తేలిగ్గా తీసుకుంటే అది మలేరియాగా మారి ప్రాణాంతకంగా మారొచ్చు. కానీ వ్యాధిబారిన పడకుండా ముందుస్తుగా తీసుకోవాల్సిన చర్యలు అత్యంత ముఖ్యం. మలేరియా దోమకాటుకు గురైన ఏడు నుంచి 18 రోజుల మధ్య మలేరియా లక్షణాలు కనిపిస్తాయి. ప్లాస్మోడియం సూక్ష్మజీవులు శరీరంలోకి చేరిన వారం, పదిరోజుల వరకు ఎలాంటి లక్షణాలు కనిపించవు. ఈ సమయంలో అవి తమ సంతతిని వృద్ధి చేసుకుంటాయి. తర్వాత ఇవి ఎర్రరక్తకణాల్లోకి ప్రవేశిస్తాయి. వీటి వల్ల ఎర్ర రక్తకణాలు పగిలిపోతుంటాయి. ఈ వ్యాధి వల్ల ఎర్ర రక్తకణాలు క్షీణించి రక్తహీనతకు దారి తీస్తుంది. కావున సరైన సమయంలో సరైన చికిత్స తీసుకుంటే ప్రమాదం నుంచి బయటపడవచ్చు.

–డాక్టర్ సరయూరెడ్డి, జనరల్ ఫిజీషియన్, కర్నూలు

క్లుప్తంగా

బాలరక్ష ఔషధాల పంపిణీ



విద్యార్థులకు బాలరక్ష ఔషధాలను అందజేస్తున్న డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): ఆయుష్ దత్తత గ్రామమైన కర్నూలు మండలంలోని పసుపుల గ్రామంలో చిన్నారులకు బాలరక్ష ఔషధాలను సీనియర్ ప్రభుత్వ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ ద్వారం ప్రభాకరరెడ్డి పంపిణీ చేశారు. సోమవారం గ్రామంలో ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ ఆరోగ్యభారతి కర్నూలు శాఖకు అందజేసిన ఇమ్యునో బూస్టర్స్, బాలరక్ష ఔషధాలను 23 మంది పిల్లలకు అందజేసినట్లు డాక్టర్ ప్రభాకరరెడ్డి తెలిపారు. అదేవిధంగా జిల్లాలో మొదటి విడతగా 15 పాఠశాలలకు వీటిని అందజేసినట్లు చెప్పారు. పాఠశాల హెచ్‌ఎం డాక్టర్ జి.ఇ.మేరమ్మ, పసుపుల గ్రామ ఆరోగ్యభారతి కార్యకర్త వి.దుర్గాప్రసాద్, జిల్లా కార్యకర్త బి.మహేష్, ఉపాధ్యాయులు బాల సుబ్బారెడ్డి, ఇందిర, సరళ కుమారి పాల్గొన్నారు.

బీజేపీని గద్దెదింపాలి

కర్నూలు(సెంట్రల్): రాష్ట్రానికి అన్యాయం చేసిన బీజేపీని కేంద్రంలో గద్దె దింపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ పిలుపునిచ్చారు. సోమవారం ప్రచారభేరీ కార్యక్రమంలో భాగంగా జొహరాపురంలో సీపీఎం, సీపీఐ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను స్థానికులకు వివరించారు. అలాగే కృష్ణానగర్, అబ్బాస్ నగర్, హౌసింగ్ బోర్డు కాలనీ, శ్రీరామ కాలనీ, గుత్తి పెట్రోల్ బంకు, శరీన్ నగర్, బాలాజీ నగర్, శారద నగర్, రామకృష్ణ కాలనీ, రామచంద్ర నగర్‌లో సీపీఎం న్యూసిటీ కమిటీ నాయకులు రాముడు, సీహెచ్ సాయిబాబా, కె.సుధాకరప్ప, సీపీఐ నగర నాయకులు వి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రచారభేరీ నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో సత్యసాయి ఆరాధన



సత్యసాయి చిత్ర పటాన్ని పల్లకీలో ఊరేగిస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్: సత్యసాయి ఆరాధన కార్యక్రమం నెహ్రూనగర్‌లోని సత్యసాయి మందిరంలో సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నగర సంకీర్తన, వేదం, అష్టోత్తర పూజ, భజన, పల్లకి సేవ కార్యక్రమాలు జరిగాయి. కొత్త బస్టాండ్ ప్రాంతంలో మజ్జిగ పంపిణీ, నారాయణులకు ఆహారం ప్యాకెట్లు పంపిణీ చేశారు. సత్యసాయి సేవా ట్రస్ట్ జిల్లా అధ్యక్షులు మాకా అశోక్‌కుమార్, సభ్యులు, సాయి భక్తులు పాల్గొన్నారు.

రక్తహీనత నివారణపై దృష్టి



కరపత్రాలు విడుదల చేస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో పిల్లలు, బాలికలు, గర్భవతులు, మహిళల్లో రక్తహీనత నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఈ మేరకు ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆమె రక్తహీనత నివారణ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైద్య ఆరోగ్యశాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, విద్యా, సంక్షేమ శాఖల అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని రక్తహీనత నివారణకు పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇంటింటి సర్వే నిర్వహించి గర్భవతులు, పిల్లలు, మహిళలు, విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి రక్తహీనత ఉన్న వారిని గుర్తించి తగిన చికిత్స, ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు అందించాలని ఆదేశించారు. జేసీ నారపురెడ్డి మౌర్య, డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య, ప్రాంతీయ శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మీనర్సయ్య, డాక్టర్ నిర్మల, సీహెచ్‌వీ సూపర్‌వైజర్ నాగమణి పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్ : కిసీ కా భాయ్ కిసీ కా జాన్, విరుపాక్షి, దసరా, ఇవిల్‌డెడ్ రైజ్, శాకుంతలం, రావణాసుర
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ : కిసీ కా భాయ్ కిసీ కా జాన్, విరుపాక్షి, దసరా, ఇవిల్‌డెడ్ రైజ్, విడుదల పార్ట్–1, రుద్రుడు, శాకుంతలం
వెంకటేష్ సినీ కాంప్లెక్స్: విరుపాక్షి, విడుదల పార్ట్–1, రుద్రుడు
ఐనాక్స్: కిసీ కా భాయ్ కిసీ కా జాన్, ఇవిల్‌డెడ్ రైజ్, సుజుమె, విడుదల పార్ట్–1, ది సూపర్ మారియో బ్రదర్స్, హలో మీరా
భరత్ కాంప్లెక్స్ : కిసీ కా భాయ్ కిసీ కా జాన్, బలగం, దసరా
శ్రీరామ : విరుపాక్షి
రాజ్ : విరుపాక్షి
విజయ : కిసీ కా భాయ్ కిసీ కా జాన్

'స్పందన' సమస్యల పరిష్కారానికి చర్యలు



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

కర్నూలు (టౌన్): ప్రతి వారం నిర్వహించే స్పందనలో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, వినతులను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక ఎస్‌ఈ వేణుగోపాల్ స్పష్టం చేశారు. సోమవారం స్థానిక నగరపాలక కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. వివిధ కాలనీల నుంచి వచ్చిన ప్రజలు సమస్యలపై అర్జీలు, వినతులు అందజేశారు. ఎస్‌ఈ ఫిర్యాదులను స్వీకరించారు. స్పందనలో మున్సిపల్ ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ మోహన్‌కుమార్, ఆరోగ్యశాఖ ఆధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు పాల్గొన్నారు.

ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని..

- తాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదని నరసింహారెడ్డి నగర్‌కు చెందిన మల్లికార్జున వినతి పత్రం ఇచ్చారు.
- హౌసింగ్ ఫర్ ఆల్ పథకం కింద గృహం మంజూరు కాలేదని, తాము చెల్లించిన మొత్తం వాపస్ ఇవ్వాలని టిలికాంనగర్‌కు చెందిన జయమ్మ విన్నవించారు.
- తమ కాలనీలో రోడ్లు, డ్రైనేజీ సమస్య, కుక్కలు, పందుల సమస్యలు ఉన్నాయని గీతానగర్‌కు చెందిన జగదీష్‌కుమార్ విన్నవించారు.
- తమ కాలనీలో తాగునీటి సమస్య, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని తుంగభద్ర కాలనీకి చెందిన రవికాంత్ అభ్యర్థించారు.
- పబ్లిక్ లెట్రిన్ పైపులైన్ పగిలిపోవడంతో దుర్గంధం వస్తోందని బుధవారపేటకు చెందిన కాలనీ వాసులు విన్నవించారు.
- రోజా వీధిలో సుంకులమ్మ దేవాలయానికి వెళ్లే రహదారి ఆక్రమణకు గురైందని కాలనీవాసులు ఫిర్యాదు చేశారు.

జనం గుండెల్లో సీఎం జగన్



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

కల్లూరు: 'జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమానికి జనం నుంచి విశేష స్పందన లభిస్తోందని, రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అండగా నిలుస్తామని ప్రజలు బాహాటంగా చెబుతున్నారని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. లబ్ధిదారుల గడపకు ప్రజా ప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, స్థానిక నాయకులు వెళ్లగా సాదర ఆహ్వానం లభిస్తోందని, అది తమలో ఎనలేని ఉత్సాహం నింపుతోందన్నారు. వృద్ధులు, లబ్ధిదారులు, మహిళలు సీఎం జగనన్నకు కృతజ్ఞతలు తెలుపుతున్నారని, ప్రభుత్వ పనితీరుపై పూర్తి విశ్వాసం తెలియజేస్తున్నారని చెప్పారు. సంక్షేమ పథకాలను కొనసాగించాలని కోరుకుంటున్నారన్నారు.

గత టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీల సిఫార్సులు ఉన్నవారికే పథకాలు అందేవని, 2014 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను టీడీపీ తుంగలో తొక్కిందని గుర్తుచేశారు. సీఎం వైఎస్ జగన్ మ్యానిఫెస్టోలో చెప్పిన హామీలన్నీ నెరవేర్చి జనం గుండెల్లో చోటు సంపాదించుకున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, మునగాలపాడు నుంచి సమ్మర్ స్టోరేజ్ పైప్‌లైన్ పనులు జరుగుతున్నాయని చెప్పారు. మే మొదటి వారంకల్లా పనులు పూర్తి అవుతాయన్నారు. అవసరమైన చోట్ల ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకుల నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. ఇవి పూర్తయితే కర్నూలు నగరానికి తాగునీరు సరఫరా అయినట్లే కల్లూరు వార్డుల్లో రోజూ నీటి సరఫరా అయ్యేలా చేస్తామని పేర్కొన్నారు. రాయలసీమలో గోరుకల్లు రిజర్వాయర్, ఎస్‌ఆర్‌బీసీ, పోతిరెడ్డిపాడు, హంద్రీనీవా సుజల స్రవంతి, గాలేరు నగరి ప్రాజెక్టులను నిర్మించారన్నారు.

లోకేష్ వాస్తవాలు తెలుసుకో..

టీడీపీ నాయకుడు నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఏ నియోజకవర్గంలో ప్రవేశిస్తే ఆ ఎమ్మెల్యేపై అనవసర ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. లోకేష్ వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు. ఎక్కడ ఏమి మాట్లాడుతున్నారో రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారన్నారు. డిప్యూటీ మేయర్ రేణుక, కార్పొరేటర్లు, కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ మీదివేముల ప్రభాకర్‌రెడ్డి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, డీఏఏబీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి, పాణ్యం ఎంపీపీ హుస్సేన్‌బీ, కల్లూరు, ఓర్వకల్లు జెడ్పీటీసీలు ఆల ప్రభాకర్‌రెడ్డి, రంగనాథ్‌గౌడ్, జేసీఎస్ కన్వీనర్లు కేశవరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, హనుమంతురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలన



సర్వే పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ, కార్పొరేటర్లు

కర్నూలు(రాజ్‌విహార్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలన సాగుతోందని వైఎస్సార్‌సీపీ కర్నూలు నగర అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 7వ తేదీ నుంచి తమ పార్టీ మెగా పీపుల్స్ సర్వే చేట్టిందని, కోటికి పైగా కుటుంబాలను కలిసినట్లు వెల్లడించారు. ఇందులో 80 శాతం మంది ప్రజలు ప్రభుత్వ పాలన పట్ల సంతృప్తి వ్యక్తం చేశారని, వారి అనుమతితోనే ఇళ్లకు జగనన్న స్టిక్కర్లు అతికించినట్లు చెప్పారు. సర్వేలో పాల్గొన్న వారంతా పార్టీ నంబర్‌కు మిస్డ్ కాల్ చేసి మద్దతు తెలిపినట్లు వెల్లడించారు. ప్రజల నుంచి మంచి స్పందన వస్తుండడంతో ఈ కార్యక్రమాన్ని ఈ నెల 29వ తేదీ వరకు పొడిగించినట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీకి ఉన్న జనాదరణను చూసి తట్టుకోలేక టీడీపీ నేత చంద్రబాబు ప్రభుత్వంపై అసత్య ప్రచారం చేస్తున్నారని, లోకేష్ పాదయాత్రలో హామీలు లేకుండా, ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేయడమే పనిగా పెట్టుకున్నాడన్నారు. టీడీపీ నేతలు ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు మానుకోవాలని సూచించారు. కార్పొరేటర్లు షాషావలి, విజయలక్ష్మి, వాసు, కో–ఆప్షన్ సభ్యులు నయీమ్, పార్టీ నాయకులు ఫైరోజ్, ఖాదర్‌బాషా, శేషు యాదవ్, పర్వేజ్, హకీం తదితరులు పాల్గొన్నారు.

విషజ్వరాలను నియంత్రించాలి

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో మలేరియా, డెంగీ జ్వరాలను పూర్తిస్థాయిలో నియంత్రించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కలెక్టరేట్‌లో లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులతో ఆమె జిల్లా కో–ఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మలేరియా, డెంగీ జ్వరాలను అరికట్టేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజల్లో కూడా అవగాహన కల్పించాలని సూచించారు. వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ముద్రించిన కరపత్రాలను సచివాలయాలు, వలంటీర్లు, అంగన్‌వాడీ, ఆశ, గ్రామ, మండల స్థాయి అధికారుల ద్వారా ఇంటింటికీ అందించాలన్నారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ రామగిడ్డయ్య, జిల్లా టీబీ అధికారి డాక్టర్ భాస్కర్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ నూకరాజు పాల్గొన్నారు.


స్కూల్‌ను సీజ్ చేయాలి

కర్నూలు సిటీ: ప్రమాదకరమైన గ్యాస్ గోడౌన్ వద్ద నిర్వహిస్తున్న ఏడీపై స్కూల్‌ను సీజ్ చేయాలని విద్యార్థి సంఘాలు సోమవారం డీఈఓ డాక్టర్ వి.రంగారెడ్డిని కలిసి వినతి పత్రాన్ని అందజేశాయి. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ, ప్రగతిశీల యువజన సంఘాల నాయకులు మట్లాడుతూ.. ప్రమాదకరంగా ఉన్న గ్యాస్ గోడౌన్ పక్కన పాఠశాలకు అనుమతించడం సరికాదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా స్టేట్ సిలబస్‌కు అనుమతులు పొంది సీబీఎస్‌ఈ సిలబస్ బోధిస్తున్న పాఠశాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయా సంఘాల నాయకులు మహేంద్ర బాబు, రమేష్, రాము, దినేష్, తదితరులు పాల్గొన్నారు.

చైన్ స్నాచింగ్ కేసు నమోదు

కర్నూలు సిటీ: మహిళ మెడలోని బంగారు గొలుసును దుండగుడు లాక్కెళ్లడంతో 3వ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో చైన్‌స్నాచింగ్ కేసు నమోదైంది. రాంనగర్‌కు చెందిన శ్వేత అనే మహిళ ఈ నెల 15వ తేదీదీన కిసాన్ ఘాట్ సమీపంలో స్విమ్మింగ్‌కు తన కుమారుడిని తీసుకెళ్లారు. తిరిగి ఇంటికి స్కూటీపై వెళుతుండగా ఆమెను ఓ యువకుడు బైక్‌పై ఫాలో అయ్యాడు. కొద్ది దూరం వెళ్లిన తరువాత యువకుడు ఆమె మెడలోని మూడు తులాల బంగారు గొలుసును లాక్కొని వెళ్లడంతో బాధితురాలు సోమవారం 3వ పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి చైన్‌స్నాచర్ కోసం గాలిస్తున్నారు.

సంక్షేమ సారథి జగనన్న



న్యూకృష్ణానగర్‌లో లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ సారథిగా నిలిచారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం 27వ వార్డు 68వ సచివాలయం పరిధిలోని న్యూ కృష్ణానగర్‌లో స్థానిక కార్పొరేటర్ పి.శారద, వార్డు నాయకులు కె.పుల్లారెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, రాఘవాచారి, పెద్ది, సురేష్ కుమార్, గోపి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వార్డులోని నాయకులు, కాలనీ వాసులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ముందుగా ఎమ్మెల్యే కాలనీలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాలనీలో పర్యటిస్తూ ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజా సమస్యలను పరిష్కరించేందుకే గడప గడపకు వస్తున్నామన్నారు. కాలనీలో ఎమైనా సమస్యలు ఉంటే తనకు తెలియజేయలన్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు డ్రైనేజీలు, సీసీ రోడ్లు, కల్వర్టులు, ర్యాంప్‌లను నిర్మించాలని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. కాలువలో పూడిక తొలగించాలని, పార్కును వినియోగంలోకి తేవాలని కోరారు. ఆయా సమస్యలను సకాలంలో పరిష్కరించాలని ఎమ్మెల్యే మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అనంతరం కాలనీలోని ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. మధ్యాహ్న భోజనంలో భాగంగా గుడ్లు, కూరగాయలను పరిశీలించారు. డిప్యూటీ మేయర్ ఎస్.రేణుక, కార్పొరేటర్లు శ్రీనివాసులు, మిద్దె చిట్టెమ్మ, లక్ష్మీకాంత రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, నాయకులు గోపాల్‌రెడ్డి, తిరుపాల్, బాలచంద్రారెడ్డి, సాయి, వెంకటరెడ్డి, సుబ్రహ్మణ్యం, బ్రహ్మానందరెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

కాలేయానికి అరుదైన శస్త్రచికిత్స

కర్నూలు(హాస్పిటల్): కాలేయం చుట్టూ ఏర్పడిన రక్తపు గడ్డను కర్నూలు కిమ్స్ హాస్పిటల్ వైద్యులు అరుదైన శస్త్రచికిత్స ద్వారా తొలగించారు. సోమవారం హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ జానకిరామ్ వెల్లడించారు. 'ఓర్వకల్లుకు చెందిన సుంకులమ్మ (43) గత నెలలో కడుపునొప్పితో కిమ్స్ ఆస్పత్రికి వచ్చింది. ఆమెకు సీటీ స్కాన్ చేయగా కాలేయం వద్ద కణితి (హిమాంజియోమా) ఉన్నట్లు గుర్తించారు. ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్ట్ డాక్టర్ అశోక్‌రెడ్డి నేతృత్వంలో ఇటీవల యాంజియోగ్రామ్ ద్వారా రక్తపు గడ్డ చుట్టూ ఉన్న రక్తనాళాలన్నింటినీ మందుల ద్వారా కరిగించారు. మరుసటి రోజు ఉదయం మత్తుమందు వైద్యులు శృతి సహకారంతో రోగికి శస్త్రచికిత్స చేసి మొత్తం గడ్డను తొలగించారు. ప్రస్తుతం ఆమె పూర్తిగా కోలుకోవడంతో డిశ్చార్జ్ చేసినట్లు వైద్యులు వెల్లడించారు.

కస్తూర్బాలో చేర్పించండి

ఓర్వకల్లు: బడిబయట ఉన్న వీధిబాలలు, అనాథ పిల్లలను కస్తూర్బా విద్యాలయంలో చేర్పించాలని సమగ్ర శిక్ష అభియాన్ అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ వేణుగోపాల్ సూచించారు. సోమవారం స్థానిక కస్తూర్బా పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాలలో మౌలిక సదుపాయాలు, భోజన నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలను కేజీబీవీలో చేర్పించాలనుకున్న వారు ఈ నెల 30వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించాలన్నారు. జిల్లాలో మొత్తం 26 పాఠశాలలు ఉండగా, ప్రతి పాఠశాలలో 6వ తరగతికి 40 సీట్లు, ఇంటర్మీడియట్‌కు 40 సీట్లు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. తల్లి/తండ్రిలేని బాలికలకు, బడిబయట ఉన్న బాలికలకు అడ్మిషన్లలో ప్రాధాన్యత ఉంటుందన్నారు. వివరాలకు సమీపంలోని కస్తూర్బా పాఠశాలలను సంప్రదించాలని సూచించారు.

నాయకత్వ లక్షణాలపై ముఖాముఖి



అతిథి డాక్టర్ చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కర్నూలు సిటీ: జి.పుల్లయ్య, రవీంద్ర మహిళా ఇంజినీరింగ్ కాలేజీల ఆధ్వర్యంలో నాయకత్వ లక్షణాల ఆవశ్యకతపై సోమవారం విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. కార్యక్రమానికి ప్రముఖ సైంటిస్ట్ డా.యు చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. మారుతున్న కాలానుగుణంగా నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. సాంకేతిక పురోగతిలో ఆధునాతన రీతులను గమనించినప్పుడే గ్లోబల్ స్థాయిలో రాణిస్తారన్నారు. రవీంద్ర విద్యా సంస్థల చైర్మన్ జి.వి.ఎం మోహన్, ప్రత్యన్ టెక్నాలజీస్ ముఖ్య కార్యనిర్వహణాధికారి సుబ్రమణ్యం శివకుమార్ మాట్లాడుతూ నైపుణ్యాభివృద్ధి, సమస్య పరిష్కార సామర్థ్యం గురించి వివరించారు. ముఖ్య సాంకేతిక అధికారి కృష్ణకుమార్ మాట్లాడారు. అనంతరం ముఖ్య అతిథిని సన్మానించారు. కాలేజీ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ వై.పాండురంగయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ సి.శ్రీనివాసరావు, డాక్టర్ శ్రీనివాసమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ట్రిపుల్ ఐటీ డీఎం డైరెక్టర్ ఆచార్య డీవీఎల్ఎన్ సోమయాజులు

కర్నూలు సిటీ: నగర శివారులోని జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీలో డేటా సైన్స్ అండ్ ఇట్స్ అప్లికేషన్స్ అంశంపై ఐదు రోజుల పాటు ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం నిర్వహించనున్నారు. సోమవారం ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ డిజైన్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ (ట్రిపుల్‌ఐటీ) డైరెక్టర్ ఆచార్య డీవీఎల్ఎన్ సోమయాజులు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఆధునిక ప్రపంచంలో డేటా సైన్స్ అంశం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అధ్యాపకులు రోజురోజుకు మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని నిత్య విద్యార్థిలాగా తెలుసుకుంటేనే విద్యార్థులకు చక్కగా బోధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. అనంతరం కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. హెచ్‌ఓడీలు డాక్టర్ ఎస్.కాశీవిశ్వనాథ్, ఆర్ ప్రవీణ్ సామ్, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.